
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3

నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
శుక్రవారం 25 ఏప్రిల్ 2025


కుచ్చు టోపీ కథ
కొలిక్కి వచ్చేనా?

- ఆశగా ఎదురుచూస్తున్న సాయిరాం ఫైనాన్స్ కంపెనీ బాధితులు
- దాదాపు రూ. 180 కోట్ల ఎగనామం
- డిపాజిట్ చేసిన సొమ్మును రాబట్టుకున్న పరపతి గల పెద్దోళ్లు
- మొత్తం వ్యవహారంలో బలైంది బడుగులే
- ఫైనాన్స్ యాజమాన్యం ఆస్తులను అటాచ్ చేశామంటున్న డీఎస్పీ

4

కుంటుపడిన
పాలన

- స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడంతో కుంటుపడిన అభివృద్ధి
- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారుల చుట్టూ చక్కర్లు
- అందుబాటులో ఉండని అధికారులు... గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు
- తరచూ వాయిదా పడుతున్న స్థానిక సంస్థల ఎన్నికలతో నష్టం
- 'ఆంధ్రజ్యోతి' సర్వేలో ఉమ్మడి పాలమూరు ప్రజల మనోగతం



స్థానిక సంస్థల్లో పాలకవర్గం లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు. గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడం లేదు. కనీసం పారిశుధ్య పనులు కూడా సకాలంలో చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో సర్పంచులు లేక ఏడాదిన్నర అవుతోంది. దీంతో గ్రామాల్లో మురుగు నీరు రోడ్లపై పారడం, ఇళ్ల మధ్యనే నిలిచినా ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక మునిసిపాలిటీల పాలకవర్గం గడువు ముగిసి.. మూడు నెలలవుతోంది. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో శంకుస్థాపనలు చేసిన పనులను కూడా చేపట్టడం లేదు. కనీసం డ్రెయినేజీలు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం విషయంలో కూడా ప్రజాప్రతినిధులు లేనిలోటు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడుతూనే ఉన్నాయి. సర్పంచుల ఎన్నికలు దాదాపు సంవత్సరన్నర.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు సంవత్సరం క్రితమే జరగాలి.. ఇక మునిసిపాలిటీల పాలకవర్గం గడువు ముగిసి.. మూడు నెలలవుతోంది. తాజా సమాచారం ప్రకారం జూన్‌లో ఎన్నికలు నిర్వహిస్తారని భావిస్తున్నప్పటికీ.. ఆ దిశగా కూడా ప్రభుత్వం అడుగులు పడటం లేదనే విమర్శలు ఉన్నాయి. చట్టసభలకు మాత్రమే సమయానికి ఎన్నికలు నిర్వహిస్తున్న ఎలక్షన్ కమిషన్లు.. స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తూ వేడుక చూస్తున్నాయి. ఈ ఎన్నికల విషయంలో శ్రద్ధ చూపేవారే లేకుండా పోయారు. దీంతో గ్రామాలు, మునిసిపాలిటీల్లో అభివృద్ధి పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో కూడా పనుల కోసం అంచనాలు వేసి.. నిధులు తీసుకువచ్చినా.. పాలకవర్గం లేకపోవడంతో అధికారుల్లో కూడా శ్రద్ధ కనిపించడం లేదు. శంకుస్థాపనలు చేసిన పనులను కూడా చేపట్టడం లేదు. ప్రజాప్రతినిధులు - మిగతా 4లో..


పెబ్బేరు మునిసిపాలిటీలో ఇళ్ల మధ్య పారుతున్న మురుగునీరు


గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డిలో రోడ్డుపైనే పాయుతున్న మురుగునీరు

ఆంధ్రజ్యోతి సర్వే


మక్తల్ మునిసిపాలిటీలోని శబరి కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

త్వరలో వంద పడకల ఆసుపత్రి పనులు ప్రారంభిస్తాం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి


డయాలసీస్ కేంద్రం సిబ్బందిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తికి మంజూరైన వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఆసుపత్రి, డయాలసిస్ కేంద్రం వైద్యులు, సిబ్బందిని మెమోంటోతో సత్కరించి అభినందించారు. అనంతరం రోగుల సహాయకుల కోసం ఏర్పాటు చేసిన షెడ్డును, అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రాన్ని విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాలని ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను, నాయకులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్రంలోని 44అపెక్స్ డయాలసిస్ కేంద్రాల్లో మన కల్వకుర్తి సామాజిక కేంద్రం మొదటి స్థానంలో నిలిచిన అవార్డు దక్కించుకుందని తెలిపారు. కల్వకుర్తికి వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహలకు కల్వకుర్తి ప్రాంత ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మార్కెట్ చైర్మన్ మనీలా సంజుకుమార్‌యాదవ్, మార్కెట్ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, ఆసుపత్రి వైద్యులు తదితరులు ఉన్నారు.

మల్లమ్మకుంట రిజర్వాయర్
రద్దుకు సిఫారసు..!



తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం

4

ఓపెన్‌గానే..

- పది, ఇంటర్ ఓపెన్ పరీక్షల్లో వసూళ్ల పర్వం

- ఉమ్మడి జిల్లాలోని అన్ని కేంద్రాల్లో లంచావతారులు
- ప్రతీ అభ్యర్థి నుంచి రూ.300 వసూలు
- నేరుగా చిట్టీలు అందిస్తున్న ఇన్విజిలేటర్లు!
- సహకరిస్తున్న సీఎస్, డీవోలు

అంతా ఓపెన్‌గానే వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఓపెన్ పరీక్షలు రాసే అభ్యర్థులు కాపీయింగ్ కోసమని అక్కడి ఇన్విజిలేటర్‌కే డబ్బులు ఇస్తుండటం గమనార్హం. ఇదే సదావకాశంగా భావించి ఒక్కో అభ్యర్థి నుంచి రూ.300 నుంచి రూ.500 దాకా వసూలు చేస్తున్నారు. ఇలా రోజూ రూ.లక్ష దాకా వసూలు చేసిన డబ్బులను సీఎస్, డీవోలు, ఇన్విజిలేటర్లు పంచుకుంటున్నట్లు తెలిసింది. ఈ దందా జరుగుతున్నా ఉన్నతాధికారులు తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పది, ఇంటర్ పరీక్షలు అంతా ఓపెన్‌గానే సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే తంతు సాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈనెల 20 నుంచి మొదలైన ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణ కోసం కొందరు ఉపాధ్యాయులు సీఎస్, డీవోలు, ఇన్విజిలేటర్లుగా నియమించాలని అధికారులపై మరి ఒత్తిడి పెట్టించి, విధుల్లో చేరి నాలుగు డబ్బులు వెనుకేసుకుంటున్నారు. ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు రాసే అభ్యర్థుల నుంచి ప్రతీ పరీక్షకు రోజుకు రూ.300 చొప్పున అక్కడి ఇన్విజిలేటర్ వసూలు చేసి పరీక్ష ముగిసిన తర్వాత పంచుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు రూ.లక్షకు పైగా వసూళ్లకు

- మిగతా 4లో..


జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా మారిన రహదారి

ఎండ ప్రచండం

- అత్యధికంగా మల్దకల్‌లో 44.8 డిగ్రీలు
- జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆరెంజ్ అలెర్ట్

వనపర్తి/నారాయణపేట/గద్వాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎండ ప్రచండంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావడానికే జంకుతున్నారు. కూలీలు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఇళ్లలో ఉన్న వారు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. గురువారం ఏకంగా మల్దకల్ మండలంలో 44.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇటిక్యాలలో 43.2, ధరూర్‌లో 42.9, అలంపూర్‌లో 42.8, అయిజ, గట్టు లలో 42.7, గద్వాలలో 42.6, కేటీదొడ్డిలో 42.3, రాజోలిలో 41.9, వడ్డేపల్లిలో 41.1, మానవపాడులో 40.8, ఉండవెల్లిలో 40.3 డిగ్రీలు నమోదైంది. కనిష్ఠంగా 26.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలో ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించారు. వనపర్తి జిల్లాలోని పెద్దమందడిలో రికార్డు స్థాయిలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మూడు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు జిల్లాలో రికార్డు స్థాయికి చేరువవుతున్నాయి. ఈ ఏడాది ఎప్పుడు లేని విధంగా గురువారం పెద్దమం దడి లో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లా అంతటా అన్ని మండలాల్లో 40కి పైగా డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కొత్తకోట, చిన్నంబావి లలో 42.9, శ్రీరంగాపూర్‌లో 42.8, వీపనగండ్ల, ఆత్మకూరు, పెబ్బేరు, పాన్‌గల్ లలో 42.7, మదనాపూర్‌లో 42.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. అత్యల్పంగా ఘణపూర్‌లో 28.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 41, కనిష్ఠం 28.1 డిగ్రీలు నమోదైంది. నారాయణపేట జిల్లా లో గరిష్ఠంగా 38 డిగ్రీ సెంటీగ్రేడ్లు, కనిష్ఠంగా 28 డిగ్రీల ఉష్ణోగత నమో దైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠంగా 38 డిగ్రీలు, కనిష్ఠంగా 26 డిగ్రీలు నమోదైంది.

నత్తనడకన
ధాన్యం కొనుగోళ్లు

అధికారుల నిర్లక్ష్యంతో ఆలస్యం

- లక్ష్యం 1.75 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటికీ కొన్నది 1007 మెట్రిక్ టన్నులు
- అకాల వర్షానికి భయపడుతున్న రైతులు
- ప్రైవేటుకు తరలించి విక్రయాలు
- మద్దతు ధర, బోనస్ కోల్పోతున్న అన్నదాతలు

గద్వాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు సమీక్షించినా ఫలితం లేకుండా పోతున్నది. కొనుగోళ్లను వేగవంతం చేయకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడుస్తుందని రైతులు భయపడుతున్నారు. దీంతో వచ్చిన కాడికి అంటూ.... వ్యవసాయ మార్కెట్‌కు తరలిస్తున్నారు. అక్కడ వారికి మద్దతు ధర లభించక పోగా బోనస్‌ను కోల్పోతున్నారు.

45 కేంద్రాలు మాత్రమే ప్రారంభం..

జిల్లాలో ధాన్యం సేకరణకు 69 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. కానీ ఇప్పటి వరకు 45 కేంద్రాలు


గద్వాల వ్యవసాయ మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం


లత్తిపురం కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యం

మాత్రమే ప్రారంభించారు. ఇందులో కూడా కొన్ని కేంద్రాలలో మాత్రమే కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 1007 మెట్రిక్ టన్నులను మాత్రమే కొనుగోలు చేశారు. దాదాపు 2.20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రత్యేక అవసరాలు, ఇతర మార్కెట్లకు పోను 1.75లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోళ్లు చేయాలని అధికారులు నిర్ణయించారు. కానీ ఆమేరకు వారు కొనుగోళ్లను పెంచడం లేదు. జిల్లాలో సక్రమంగా ధాన్యం కేటాయించేందుకు 37మిల్లులు మాత్రమే ఉన్నాయని అధికారులు నిర్ధారించారు. ఆ మేరకు వానకాలంలో అగ్రిమెంట్ చేసుకున్నారు. యాసంగిలో కూడా ఆ మిల్లుల యజమానులతో అగ్రిమెంటు చేసుకుంటామని అధికారులు ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు 17రైస్ మిల్లుల యజమానులతో మాత్రమే అగ్రిమెంటు చేసుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొనుగోళ్లు పుంజుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అకాల వర్షాలు వస్తే ధాన్యం తడిచిపోతుందనే భయంతో ప్రైవేటు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. గద్వాల వ్యవసాయ మార్కెట్ ప్రతీ రోజు 3,500లకు పైగా సంచుల సన్నధాన్యం వస్తుంది. క్వింటా గరిష్ఠంగా రూ.2100 కనిష్ఠంగా రూ.1950వరకు లభిస్తుంది. రైతులు మద్దతు ధరతో పాటు బోనస్‌ను కోల్పోతున్నారు. అంటే క్వింటాకు దాదాపుగా రూ.700ల నుంచి రూ.850ల వరకు రైతులు నష్టపోతున్నారు.

అగ్రిమెంట్లు చేయిస్తున్నాం..

జిల్లాలో 37 మిల్లులకు గాను బుధవారం వరకు 17రైస్ మిల్లుల యజమానులతో అగ్రిమెంట్లు చేసుకున్నాం. మిగిలిన వారితో కూడా చేస్తున్నాం. కొందరు బ్యాంకు గ్యారెంటీల వంటివి పెండింగ్‌లో ఉన్నాయి. అన్నింటినీ పరిశీలించి చేస్తున్నాం.

- విమల, సివిల్ సప్లయ్ మేనేజర్, గద్వాల

వసూలు రాజాలు

- ఏసీబీకి పట్టుబడుతున్నా మారని పలువురు ఉద్యోగుల తీరు

వనపర్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో కొంతమంది ఉద్యోగులు, సిబ్బంది వసూలు రాజాలుగా అవతారమెత్తారు. పైసలివ్వనిదే పని చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి డబ్బులు వసూలు చేస్తున్నారు. విద్యుత్ ఉద్యోగుల తీరుపై విసిగిపోయిన పలువురు వినియోగదారులు ఏసీబీ అధికారులను సంప్రదిస్తున్నారు. వారు ప్రత్యేక నిఘా ఉంచి పక్కా సమాచారంతో పట్టుకుంటున్నారు. గత ఏడాది మే 31న రూ. 19వేలు లంచం తీసుకుంటూ ఎస్ఈ నాగేంద్ర కుమార్, డీఈ నరేంద్ర కుమార్, ఏఈ మధుకర్ ఏసీబీ అధికారులు పట్టుబడడం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం ఖిల్లాఘణపూర్ మండలంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న కొండయ్య మల్కాపూర్ గ్రామంలో రైస్‌మిల్ విద్యుత్ కనెక్షన్ కోసం రూ.50వేలు డిమాండ్ చేశారు. ఒప్పుకున్న ప్రకారం సదరు కాంట్రాక్టర్ గతంలో రూ.30వేలు ఇచ్చాడు. మళ్లీ 20వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా ఏసీబీని ఆశ్రయించడంతో వారి సూచన మేరకు డీఈ కార్యాలయంలో రూ.10వేలు ఇస్తుండగా ఏఈ కొండయ్యను ఏసీబీ అధికారులకు పట్టుకున్నారు.


గతేడాది లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విద్యుత్ ఎస్ఈ, డీఈ, ఏఈ

ఏ పని చేయాలన్నా..

వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు వారి అవసరం నిమిత్తం మీటర్, ట్రాన్స్‌ఫార్మర్లు కావాలంటే నరకయాతన అనుభవించాల్సిందే. జిల్లా కేంద్రంలోని ఎస్ఈ, డీఈ కార్యాలయంలో కొంతమంది ఏళ్లతరబడి తిష్ట వేశారు. ఏ పని కావాలన్నా రేట్ ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎల్సీ కోసం కూడా కిందిస్థాయి సిబ్బంది దావత్‌లు ఇప్పించుకుని పనులు చేస్తున్నారు. ఉన్నతాధికారులకు తెలిసిన కూడా చర్యలు తీసుకోకపోవడం వెనకాల విమర్శలు వినిపిస్తున్నాయి.

లక్షల్లో వేతనాలు.. అయినా కక్కుర్తి ..

విద్యుత్ శాఖలోని ఉద్యోగులకు ఇతర శాఖలోని ఉద్యోగుల కన్నా వేతనాలు లక్షల్లో ఉంటాయి. అయినా ఆ ఉద్యోగులు డబ్బు పిచ్చితో పేదల నుంచి సంపన్నుల వరకు ప్రతీ చిన్న పనికి లంచం తీసుకుంటున్నారు. ప్రధానంగా నూతనంగా వ్యవసాయ, పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లు మంజూరు అయితే చాలు వారికి కాసులపంటే, కాంట్రాక్టర్ల ద్వారా తమకు రావాల్సిన పర్సంటేజ్‌లను అధికారులు వసూలు చేసుకుంటున్నారు.

ఓపెన్‌గానే..

(3వ పేజీ తరువాయి)

పాల్పడుతున్నారు. ఈ దందా జరుగుతున్నా ఉన్నతాధికారులు తమకేమి తెలియనట్లు వ్యవహరిస్తున్నారు.

డబ్బులు ఇస్తేనే చిట్టీలు అందిస్తున్న ఇన్విజిలేటర్..

వివిధ శాఖల్లో అటెండర్, జూనియర్ అసిస్టెంట్, తదితర విభాగాలలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు, మధ్యలో చదువు మానివేసిన నిరుద్యోగులు ఓపెన్ స్కూల్ చదువుకునే అవకాశం ఉంటుంది. అయితే, అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్‌కు అడ్మిషన్, పరీక్ష ఫీజులు చెల్లించి రాస్తున్నారు. అభ్యర్థులు పూర్తిస్థాయిలో చదువుకునే అవకాశం లేకపోవడంతో పరీక్షలు రాసేందుకు కొంత ఇబ్బంది పడుతున్నారు. దీన్ని అవకాశంగా తీసుకున్న ఓపెన్ స్కూల్ నిర్వాహకులు అభ్యర్థుల నుంచి డబ్బులు రాబట్టుకుంటున్నారు. చూచిరాత పరీక్ష రాసేందుకు అన్ని విధాల అవకాశం కల్పిస్తాం... సీఎస్, డీవోలను, అక్కడి ఇన్విజిలేటర్లను చూసుకుంటే చాలు.. రోజు పరీక్షలకు మూడు నుంచి ఐదు వందల రూపాయలు ఇస్తే వారి నుంచే పరీక్ష హాల్‌లో నేరుగా ప్రశ్నకు సంబంధించిన జవాబు చిట్టీ ఇస్తారు.. టకటకా రాసుకుంటే చాలు మీరు పాస్ కావచ్చు అని భరోసా ఇస్తున్నారు. దీంతో అభ్యర్థులు అందుకు అంగీకరించి రోజూ పరీక్షకు ముందే హాల్ ఇన్‌చార్జికి ఒక్కో అభ్యర్థి చెప్పిన ప్రకారం డబ్బులు ఇస్తున్నారు. దీంతో ఓపెన్ పది, ఇంటర్మీడియట్ పరీక్షలు జోరుగా కాపీయింగ్ నడుస్తున్నది. నేరుగా పరీక్ష కేంద్రంలోకి సబ్జెక్టులకు సంబంధించిన టెస్ట్ పేపర్స్, గైడ్ తీసుకుపోయి పరీక్షలు రాస్తున్నారు. అక్కడి సీఎస్, డీవోలు పరీక్ష కేంద్రంలో గేట్‌లకు తాళం వేసి గట్టి పోలీసు బందోబస్తు మధ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. లోపల మాత్రం గుట్టుచప్పుడు కాకుండా కాపీయింగ్ సాగుతున్నది. విద్యాశాఖ అధికారులు మాత్రం అటువైపు చూడటం లేదు. ఒకవేళ పరీక్ష కేంద్రాలను పరిశీలించినా.. వచ్చామా.. వెళ్లామా.. అన్న విధంగా సాగుతోంది వీరి వ్యవహారం.

డబ్బులు తీసుకుంటున్నారు - ఓ అభ్యర్థి

పరీక్షలు కాపీయింగ్ రాయించేందుకు ప్రతీ అభ్యర్థి నుంచి రూ.300 నుంచి రూ.500 తీసుకుంటున్నారు. పరీక్షకు డబ్బులు ఇస్తేనే హాల్‌లో చిట్టీలు రాయనిస్తున్నారు. లేకుంటే వచ్చింది రాయమంటున్నారు. అసలు పక్కకు కూడా తిరగనివ్వడం లేదు. పరీక్షకు ముందే సెంటర్‌లోకి వచ్చిన వెంటనే డబ్బులు తెచ్చారా?.. అని అడిగి డబ్బులు తీసుకుంటున్నారు.

డబ్బులు తీసుకుంటున్నట్లు నా దృష్టికి వచ్చింది

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థుల నుంచి అక్కడి ఇన్విజిలేటర్ డబ్బులు వసూలు చేస్తున్నారని తన దృష్టికి వచ్చింది. దీనిపై ఎక్కడ జరుగుతుందో వివరాలు తీసుకొని చర్యలు తీసుకుంటాం.

- ఎ.ప్రవీణ్‌కుమార్, డీఈవో, మహబూబ్‌నగర్

మలేరియా.. భయం లేదయా..

- ముందస్తు చర్యలతో పూర్తి స్థాయిలో కట్టడి
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో అతి తక్కువ కేసులు
- నేడు ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం


పేట జిల్లాలో మందు పిచికారి చేస్తున్న వైద్యసిబ్బంది

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ప్రజలు మలేరియా అంటేనే వణికి పోయేవారు.. ఏ చిన్న జ్వరం వచ్చినా వైద్యులు ముందుగా మలేరియా టెస్టు చేసేవారు. అందులో నెగెటివ్ ఉందంటే సరే. పాజిటివ్ వచ్చిందంటే ఇక హడలే. కొద్దిపాటి నిర్లక్ష్యం వహించినా ప్రాణాలకే ముప్పు ఉండేది. కాని ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. మహబూబ్‌నగర్ జిల్లాలో గత కొన్నేళ్లుగా మలేరియా కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదు. అయితే 2023లో 4 కేసులు నమోదు కాగా, వారందరూ ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీలు కావడం గమనార్హం. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటుండటంతో జిల్లాలో మలేరియా దాదాపు కనుమరుగైనట్లే అని చెప్పవచ్చు. నేడు ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

దోమల ద్వారా వ్యాప్తి

అనాఫిలిస్ అనే ఆడ దోమ కుట్టడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది. జ్వరం, నీరసం, అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, స్వల్ప ఇన్‌ఫెక్షన్లు ఈ వ్యాధి లక్షణాలు. మలేరియా వ్యాధి ప్రధానంగా నవంబరు, డిసెంబర్, జనవరి నెలల్లో ప్రబలుతూ ఉంటుంది. ఐదేళ్ల లోపు చిన్నారులు, గర్భిణులు, హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 2022 నుంచి 2024వ సంవత్సరం వరకు పరిశీలిస్తే ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాలేదు. అక్కడక్కడ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వ్యాధి లక్షణాలున్న కొంత మంది చికిత్స తీసుకున్నారు. కానీ పాజిటివ్ కేసులు మాత్రం నమోదు కాలేదు. అయితే 2023లో 4 పాజిటివ్ కేసులు నమోదైనా, వ్యాధి సోకిన వారందరూ ఇతర రాష్ట్రాలకు చెందిన వారే కావడం గమనార్హం. వారందరూ కర్వెన ప్రాజెక్టులో పని చేసేందుకు జిల్లాకు వలస వచ్చారు. మిగిలిన సంవత్సరాల్లో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు.

కనుమరుగవుతున్న వ్యాధి

మహబూబ్‌నగర్ జిల్లాలో మలేరియా వ్యాధి కనుమరుగవు తోంది. ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతాలు, నీరు ఎక్కువగా నిల్వ ఉండే ప్రాంతాల్లో కేసులు పెరిగేందుకు అవకాశం ఉంటుంది. కానీ మహబూబ్‌నగర్ జిల్లాలో అలాంటి పరిస్థితి లేదు. దీంతో పాటు మలేరియా వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకుంటోంది. సీజనల్ వ్యాధుల కాలంలో ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తున్నారు. ఎవరైనా జ్వర పీడితులుంటే మలేరియా పరీక్షలు చేస్తున్నారు. ఏమాత్రం లక్షణాలు కనిపించినా స్థానిక ఆసుపత్రులకు రెఫర్ చేసి చికిత్స అందిస్తున్నారు. వారికి స్వస్థత చేకూరే వరకు పర్యవేక్షిస్తున్నారు. ఫలితంగా మలేరియా వ్యాధి వ్యాప్తిని అరికడుతున్నారు. ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, జిల్లాలో మలేరియా నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ఆసుపత్రులకు రెఫర్ చేసి ప్రత్యేక చికిత్స అందిస్తున్నామన్నారు. వ్యాధి నివారణకు మందులు అందుబాటులో ఉన్నాయని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు.

కోస్గి మండలం చంద్రవంచలో మలేరియా కేసు నమోదుతో అప్రమత్తమై మందు పిచికారి చేస్తున్న వైద్యసిబ్బంది




పేట మండలం పేరపల్లలో నిలిచిన వర్షపు నీరు పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది ఫైల్

ఉమ్మడి జిల్లా పరిధిలో..

- నారాయణపేట జిల్లాలో 2023 నుంచి ఇప్పటి వరకు మూడు మలేరియా కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో 1, గత ఏడాది జూన్‌లో 1, 2023, సెప్టెంబర్‌లో మరో కేసు నమోదయ్యింది.
- జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలం బస్వాపురంలో 2002లో ఒకే ఒక్క కేసు నమోదయ్యింది.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో 2022లో కేసులు నమోదు కాలేదు. 2023లో 2, 2024లో 4 కేసులు నమోదయ్యాయి.
- వనపర్తి జిల్లాలో ఈ నాలుగేళ్లల్లో మలేరియా కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక


బిజినేపల్లిలోని మాస్టర్ మైండ్స్ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

బిజినేపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండల కేంద్రంలోని మాస్టర్ మైండ్స్ పాఠశాల విద్యార్థులు సాయిధాత్రి, అక్షిత్ రెడ్డి, బన్ని, రాకేశ్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నారా యణపేట జిల్లాలోని బిజ్వర్ గ్రామంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వ హించనున్న పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గురువారం వారిని ఎంఈవో రఘునాథ్ శర్మ, డైరెక్టర్లు భానుప్రకాశ్ రెడ్డి, సత్తార్, వహీద్, సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, పీఈటీ శ్రీనివాస్‌లు అభినం దించారు.

ఫెడరేషన్ కప్ కబడ్డీ టోర్నీ రెఫరీగా శ్రీనివాసులు


శ్రీనివాసులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఫెడరేషన్ కబడ్డీ పురుషుల టోర్నమెంట్‌కు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన శ్రీనివాసులు రెఫరీగా నియమితులయ్యారు. మహారాష్ట్రలోని అమరావతిలో వచ్చేనెల 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీల్లో ఆయన రెఫరీగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా ఆయన అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులకు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రథమ చికిత్సా కేంద్రం సీజ్


క్లీనిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రాంమందిర్ చౌరస్తాలో కొనసాగుతున్న ప్రథమ చికిత్సా కేంద్రాన్ని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికా రులు సీజ్ చేశారు. రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు ఇటీవల పట్ట ణంలోని పలు ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ క్రమంలో రాంమందిర్ చౌరస్తాలోని శ్రీరామ్ క్లినిక్‌ను అనుమతి లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేయించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ ఆదేశం మేరకు, జిల్లా మాస్ మీడియా అధికారి మంజుల పోలీసుల సహాయంతో క్లినిక్‌కు వెళ్లి సీజ్ చేశారు.

కుంటుపడిన పాలన..

ఆంధ్రజ్యోతి సర్వే

(3వ పేజీ తరువాయి)

ఉంటే.. మళ్లీ ఎన్నికల్లో తమకు ఓట్లు పడవనే భయంతోనే.. ప్రతిపక్షాలు విమర్శిస్తాయనే భావనతోనే.. వేగంగా పనులు చేయడానికి ఆస్కారం ఉండేది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రత్యేక అధికారులు పట్టించుకోక.. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక.. మాజీ ప్రజాప్రతినిధులు బిల్లులు రాలేదనే ఇబ్బందుల మధ్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం డ్రెయినేజీలు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం విషయంలో కూడా ప్రజాప్రతినిధులు లేనిలోటు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఇదే విషయంపై ఆంధ్రజ్యోతి ఉమ్మడి పాలమూరు జిల్లాలో సర్వే నిర్వహించింది. మొత్తం 13 నియోజకవర్గాల పరిధిలోని 2,450 మందిని సర్వే చేయగా..వారి మనోగతాన్ని వెల్లడించారు.

పెరుగుతున్న తలనొప్పులు...

పాలకవర్గాల గడువు ముగిసేలోపే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి.. నూతన పాలకవర్గాలను ఎన్నుకోవాలి. కానీ స్థానిక సంస్థల విషయంలో ఏ ప్రభుత్వమూ సమయానికి ఎన్నికలకు వెళ్లడం లేదు. ప్రస్తుతం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కులగణన చేసి.. అసెంబ్లీలో తీర్మానం చేశారు. అయితే అందుకు కేంద్ర ప్రభుత్వం కూడా అనుమతించాల్సి ఉంటుంది. ఇది ఇప్పట్లో తేలే పరిస్థితి కనిపించడం లేదు. ఇక గతంలో చేసిన చట్టంలో రెండు టర్మ్‌లకు ఒకే రిజర్వేషన్ ఉంటుందనే నిబంధన ఉంది. రిజర్వేషన్లు మార్చాలంటే పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేయడమో లేదా ఆర్డినెన్స్ తీసుకువచ్చి ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. ఇది ఇంకా సమయం తీసుకోనుంది. అలాగే ఆశావహులు ఇప్పటికే పోటీపడుతూ.. ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. అటు అధికార, ఇటు ప్రతిపక్ష పార్టీల్లో కచ్చితంగా పోటీవాతావరణం ఉంది. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎలాంటి ఎన్నికలు కూడా జరగకపోవడంతో గ్రామీణ, పట్టణ సమస్యల పరిష్కారానికి ప్రజలు ఎమ్మెల్యేల చుట్టూ తిరగడం వారికీ తలనొప్పిగా మారింది. ప్రస్తుతం ప్రత్యేక అధి కారుల పాలన కొనసాగుతున్నప్పటికీ.. ప్రజా ప్రతినిధులు లేని లోటు కనిపిస్తోందని ప్రజ లు సర్వేలో తెలిపారు. అలాగే ప్రత్యేక అధికా రులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం, వారి పాలన కూడా బాగా లేకపోవడం, ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు.


ఉండవల్లి మండలం, కలుగొట్లలో ఇటీవల కురిసిన వర్షానికి ఇలా రోడ్డుపై నిలిచిన నీరు.


ఉండవల్లి మం. బొంకూరులో నెహ్రూ పేటలో లోపించిన పారిశుద్ధ్యం

గ్రామాల్లో అభివృద్ధి పనులు లేవు...



గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి జరగాలంటే ప్రజాప్రతినిధులు ఉండాలి. గ్రామాల్లో వారు లేక అభివృద్ధి జరగడం లేదు. గతంలో ప్రజలకు సమస్యలు ఉంటే సర్పంచులు, ఎంపీటీసీలకు చెప్పుకునేవాళ్లం, సర్పంచుల కాలం ముగిసినప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలనలో పనులు జరగడం లేదు. ఏదైనా సమస్య వస్తే మాజీ సర్పంచుల వద్దకు వెళ్తే వారూ పట్టించుకోవడం లేదు.

- బుచ్చిబాబు, పెద్దగూడెం, వనపర్తి జిల్లా

ఎన్నికలు నిర్వహించాలి



ప్రత్యేకాధికారుల పాలన సరిగాలేదు. ప్రభుత్వం వెంటనే ఎన్నికలు నిర్వహించాలి. గ్రామాలలో, మున్సిపల్ వార్డుల లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. ప్రజలకు ఎలాంటి పనులు జరగడంలేదు. ప్రత్యేకాధికారులు ఎప్పుడు వస్తరో ఎప్పుడు వెలతారో ఎవరికి తెలియదు. మా మున్సిపాలిటీకి నారాయణపేట అదనపు కలెక్టర్ ప్రత్యేకాధికారిగా ఉన్నారు.

- వెంకట్రాములు, కోస్గి

కుచ్చు టోపీ కథ కొలిక్కి వచ్చేనా?

- ఆశగా ఎదురుచూస్తున్న సాయిరాం ఫైనాన్స్ కంపెనీ బాధితులు
- దాదాపు రూ. 180 కోట్ల ఎగనామం
- డిపాజిట్ చేసిన సొమ్మును రాబట్టుకున్న పరపతి గల పెద్దోళ్లు
- మొత్తం వ్యవహారంలో బలైంది బడుగులే
- ఫైనాన్స్ యాజమాన్యం ఆస్తులను అటాచ్ చేశామంటున్న డీఎస్పీ

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అధిక వడ్డీ ఆశచూపి అన్ని వర్గాల ప్రజలపై శఠగోపం పెట్టిన జిల్లా కేంద్రంలోని సాయిరాం ఫైనాన్స్ కంపెనీలో తాము దాచుకున్న సొమ్ము తిరిగి వస్తుందా లేదా అనే ఆందోళనను బాధితులు వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ. 180 కోట్ల ఈ స్కాంలో పరపతి గల పెద్దోళ్లు ఏదోలా తమ సొమ్మును వసూలు చేసుకోగా బడుగులే బలయ్యారు. అయితే బాధితుల ఆందోళనను పరిగణనలోకి తీసుకొని కేసు నమోదు చేసి ఫైనాన్స్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించడమే కాకుండా దాదాపు రూ. 50 కోట్ల విలువైన ఆస్తులను కూడా కోర్టుకు అటాచ్ చేస్తూ నివేదికను పంపించామని నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు.

రూ. 180 కోట్ల స్కాంలో ఆరుగురు సూత్రధారులు

జిల్లా కేంద్రంలోని పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో గోపాల్‌పేట మండలం నాగపూర్‌కు చెందిన సాయిబాబా, ధనుంజయలతో పాటు మరో నలుగురు కలిసి పదేళ్ల క్రితం సాయిరాం ఫైనాన్స్ కంపెనీని నెలకొల్పారు. అనుమతిలేని చీటీల వ్యాపారం నడుపుతూనే దీంట్లో లాభాలు ఎక్కువగా రావడంలేదని గమనించి డిపాజిట్ల సేకరణపై దృష్టి సారించారు. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్, వనపర్తి, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాలలో తమ ఏజెంట్లను నియమించుకొని రూ. 2 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు దాదాపు రూ. 200 కోట్లు డిపాజిట్లు సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. లక్షకు రూ. 3 నుంచి రూ. 5 వడ్డీ చెల్లిస్తామని నమ్మబలికారు. వారి పాచికలు ఫలించాయి. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి నియోజకవర్గాలలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్వాసితులు, భూములు కోల్పోయిన వారికి వచ్చిన నష్టపరిహారం వివరాలు తెలుసుకొని నిర్వాసితులే టార్గెట్‌గా డిపాజిట్ల సేకరణను ప్రారంభించారు. ఈ క్రమంలో నాగపూర్, బండరాయిపాకుల, కోడేరు, సున్నపు తండా, పెద్దకొత్తపల్లి మండలాల్లో నిర్వాసితులందరినీ అధిక వడ్డీ ఆశ చూపి లోబర్చుకున్నారు. ఆ తర్వాత వీళ్ల దృష్టి రిటైర్డు ఉద్యోగులపై పడింది. పదవీ విరమణ పొందిన వారి వివరాలు సేకరించి బ్యాంకుల్లో మీరు డబ్బులు దాచుకుంటే తక్కువ వడ్డీ వస్తుందని, తమ ఫైనాన్స్‌లో డిపాజిట్ చేయండి, మీ జీవితాలు మారిపోతాయని నమ్మబలికారు. బాధాకరమైన విషయమేమిటంటే తిమ్మాజిపేట మండలం గొరిటకు చెందిన దస్తగిరి కుమారుడు ఆర్మీలో పని చేస్తూ జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదులతో పోరాడుతూ వీర మరణం పొందగా 40 లక్షల పరిహారం ప్రభుత్వం ద్వారా అందింది. ఈ విషయాన్ని కూడా కనుక్కున్న సాయిరాం ఫైనాన్స్ ఏజెంట్లు దస్తగిరిని మభ్యపెట్టి రూ. 40 లక్షల డిపాజిట్‌గా తీసుకున్నారు. సాయిరాం ఫైనాన్స్ బోర్డు తిప్పేసిన వ్యవహారాన్ని తెలుసుకొని తన సొమ్ము తనకు వాపస్ ఇవ్వాల్సిందిగా కోరిన దస్తగిరిపై ఫైనాన్స్ యాజమాన్యం దౌర్జన్యానికి పాల్పడింది.

బలైంది బడుగులే

సాయిరాం ఫైనాన్స్ కుచ్చుటోపీ పెట్టిన వ్యవహారంలో బడుగులే బలయ్యారు. జిల్లా వ్యాప్తంగా 2500 మంది బాధితులుండగా ఇందులో సామాన్య, మధ్య తరగతి ప్రజలే అధికంగా ఉన్నారు. కొందరు ఉన్నత వర్గాలకు చెందిన వారు కూడా అధిక వడ్డీకి ఆశ పడి డిపాజిట్లు చేసినా ఫైనాన్స్ కంపెనీ బోర్డు తిప్పేసిన వెంటనే వారి పలుకుబడిని ఉపయోగించుకొని సొమ్మును వసూలు చేసుకున్నారు. కొందరు రాజకీయ నాయకులు కూడా ఫైనాన్స్ కంపెనీలో డిపాజిట్లు చేసిన తమ ప్రధాన అనుచరులకు డబ్బులు ఇప్పించడానికి ప్రాధాన్యతను చూపారే తప్పా బడుగుల గురించి పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి.

ఫైనాన్స్ యాజమాని ఆస్తులను అటాచ్ చేశాం

సాయిరాం ఫైనాన్స్ అంశంలో బాధితుల ఫిర్యాదు మేరకు వెంటనే కేసు నమోదు చేశాం. ఫైనాన్స్ కంపెనీ యాజమాన్యం జనానికి మోసగించిన విషయం మా ప్రాథమిక విచారణలో తేలింది. దాదాపు 1400 మంది బాధితుల వద్ద ఫైనాన్స్ కంపెనీ చేసిన మోసాలను గుర్తించి యాజమాన్యంపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపించాం. ఫైనాన్స్‌లో డైరెక్టర్లు, వారి బంధువుల పేర్ల మీద ఉన్న ఆస్తులను నోటిఫైడ్ చేశాము. వీటి విలువ దాదాపు రూ. 50 కోట్ల వరకు ఉంటుంది. ఆస్తులను కోర్టుకు అటాచ్ చేస్తూ నివేదికను పంపించాం.

- శ్రీనివాస్‌యాదవ్, నాగర్‌కర్నూల్ డీఎస్పీ

మల్లమ్మకుంట రిజర్వాయర్ రద్దుకు సిఫారసు...!

- దళితులు భూములు కోల్పోతున్నారని ఎంపీ లేఖ
- పరిశీలించాలని ఇరిగేషన్ శాఖను కోరిన కలెక్టర్
- రద్దు సిఫారసుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు


పంపుల ద్వారా కాల్వలోకి చేరుతున్న నీరు (ఫైల్)

గద్వాల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంలో భాగమైన మల్లమ్మకుంట రిజర్వాయర్‌ను రద్దు చేసి మరోచోట నిర్మాణం కోసం పరిశీలన చేయాలని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి కలెక్ట ర్ సంతోష్‌ను కోరారు. దీంతో కలెక్టర్ ఈ నెల 10వ తేదీన ఇరిగేషన్ అధికారులకు లేఖ రాశారు. రిజర్వాయర్ నిర్మాణంలో ఎక్కువ మంది చిన్న, సన్నకారు రైతులు, దళితులు భూములు కోల్పోతున్నారని, వారికి జీవనోపాధి కష్టమవుతుందని, దానిని మరోచోటుకు మార్చాలని ఎంపీ ఇచ్చిన లేఖను జతచేస్తూ జిల్లా ఇరిగేషన్ అధికారులకు లేఖ రాశారు. దీనిపై ఆర్డీఎస్ పరిధిలోని తుమ్మిళ్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో తుమ్మిళ్ల దగ్గర ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. ఆర్డీఎస్ కింద రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదని ఆయకట్టు రైతులు సాగుకు నోచుకోవడం లేదని ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఎత్తిపోతల పథకం నిర్మించింది. 2017లో రూ.783 కోట్లు మంజూరు చేయగా, 2018 జనవరి 8న అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. రికార్డు స్థాయిలో పనులు పూర్తి చేసి అదే ఏడాది ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ఆర్డీఎస్ చివరి ఆయకట్టు పరిధిలోని డీ-23 నుంచి డీ-40 వరకు ఉన్న దాదాపు 55,500 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. మొదటి విడతలో రూ. 389 కోట్లతో పంపులు, విద్యుత్, మోటారు పైపుల నిర్మాణంతో దీనిని పూర్తి చేశారు.

రెండో విడతలో రూ. 386 కోట్లతో మల్లమ్మకుంట, జులకల్లు, వల్లూరు రిజర్వాయర్లను నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందులో ప్రధానమైనది మల్లమ్మకుంట రిజర్వాయర్. 1.5 టీఎంసీలతో నిర్మించాలని ఇందుకోసం 572 ఎకరాలు భూసేకరణ చేయాలని అధికారులు నిర్ణయించారు. గత ప్రభుత్వమే రిజర్వాయర్ నిర్మాణం కోసం పరిపాలన అనుమతులు ఇచ్చింది. భూసేకరణ చేసే సమయంలో ఎన్నికలు రావడం ప్రభుత్వం మారిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది.

సరైన ప్రదేశాన్ని ఎంపిక చేశారు..

తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంలో మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణం ప్రదేశం పూర్తిగా అనుకూలమైనది. రెండు కొండల మధ్య దీనిని తీసుకున్నారు. అందుకు 1.5 టీఎంసీ నీటి నిల్వకు 575 ఎకరాలు మాత్రమే భూములు కోల్పోతున్నారు. భౌగోళికంగా ఈ ప్రదేశం చాలా అనుకూలమైనదని, అలాంటి రిజర్వాయర్ ప్రదేశం మార్చడం సాధ్యం కాదని తెలుస్తోంది. ఒకవేళ మార్చాలంటే మంత్రివర్గంలో చర్చించి గతంలో ఇచ్చిన జీవోను రద్దు చేసి మరోచోటికి మార్చాలి. మరోచోటుకు మార్చితే అక్కడ భూసేకరణ ఎక్కువ చేయడంతో పాటు నిర్మాణ వ్యయం కూడా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కలెక్టర్ లేఖను పరిశీలిస్తాం..



ప్రజాప్రతినిధులు సూచించిన మేరకు జిల్లా కలెక్టర్ మలమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణం ప్రదేశాన్ని పరిశీలన చేయమన్నారు. ఈ మేరకు కలెక్టర్‌ను పరిశీలించి సాధ్యాసాధ్యాలను నిశితంగా పరిశీలన చేసి కలెక్టర్ నివేదిక ద్వారా వివరిస్తాం.

- రహీముద్దీన్, ఎస్ఈ ఇరిగేషన్ శాఖ, గద్వాల

రద్దు సిఫారుసై రైతుల ఆగ్రహం...

మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణలో ఎక్కువగా చిన్న, సన్నకారు రైతులు భూములు కోల్పోతున్నారని, వారికి జీవనోపాధి కరువవుతుందని, దీనిని రద్దు చేసి మరోచోట నిర్మించాలని సూచించడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోచోటైన రైతులు భూములు కోల్పోతారని.. అక్కడ కూడా ఇదే సమస్య వస్తుందన్న విషయం నాయకులకు తెలియదా అంటూ రైతుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

క్రైం కార్నర్

చిన్నారి అనుమానాస్పద మృతి



చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



అద్విక (ఫైల్)

అమరచింత, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : సోదరుడితో కలిసి ఆడుకుంటున్న ఓ చిన్నారి అనుమానాస్పదంగా మృతి చెందింది. వనపర్తి జిల్లా అమరచింతలో బుధవారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కురువ వీధికి చెందిన వంశీ, గాయత్రి దంపతులకు అద్విక (18 నెలలు), మణిసాత్విక్ (3) ఇద్దరు సంతానం ఉన్నారు. బుధవారం ఉదయం తండ్రి కూలీ పనికి వెళ్లాడు. తల్లి సమీపంలోని బంధువుల ఇంటి వద్ద చౌడును ఎత్తి మీద్దె మీద పోస్తోంది. ఇద్దరు చిన్నారులు ఇంటికి కొద్ది దూరంలో ఆడుకుంటూ ఉన్నారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అద్విక నురుగులు కక్కుకొని స్పృహ తప్పి పడిపోయింది. స్థానికులు గమనించి తల్లికి చెప్పడంతో ఆమె పరుగున అక్కడికి చేరుకున్నది. వెంటనే 108 అంబులెన్స్‌లో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తండ్రికి తెలియడంతో ఆసుపత్రికి చేరుకున్నాడు. ఆ లోపే గ్రామం నుంచి బంధువులు ఆయనకు ఫోన్ చేశారు. మణిసాత్విక్ కాళ్లకు బొబ్బలు వచ్చాయని తెలిపారు. దీంతో వెంటనే ఇంటికి చేరుకున్న ఆయన బంధువుల వెంట కుమారుడిని మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. కాలనీలోని ఓ ఇంటి ముందున్న శీతల పానీయం సీసాలోని ద్రవాన్ని బాలిక తాగి ఉండొచ్చని, అందులో యాసిడ్ లాంటి ద్రవం ఉందా? గడువు ముగిసి బయట పడేసిన శీతల పానీయం ఉందా? అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శీతల పానీయం బాటిల్‌లోని ద్రవాన్ని తాగినందుకే కుమార్తె మృతి చెందిందని పేర్కొంటూ తల్లి గాయత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాలకిష్టయ్య హెడ్ కానిస్టేబుల్ రాములు తెలిపారు.

చెరువులో పడి వివాహిత మృతి

బిజినేపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని పాలెం గ్రామ సమీపంలోని పెంటోని చెరువులో పడి గుంపాల లక్ష్మమ్మ (46) అనే వివాహిత మృతి చెందింది. ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బిజినేపల్లికి చెందిన లక్ష్మమ్మ బుధవా రం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆ చూకీ లభించలేదు. గురువారం ఉదయం పెం టోని చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. విచారణ చేపట్టి ఆమెను గుంపాల లక్ష్మమ్మగా గుర్తించి కుటుంబసభ్యులకు తెలిపారు. మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆమె భర్త వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

అడవి జంతువుల దాడి

▸▸ 15 గొర్రె పొట్టేళ్లు మృతి

ఊర్కొండ/ మరికల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అడవి జంతువుల దాడిలో 15 గొర్రె పొట్టేళ్లు చనిపోయాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని మాదారంలో ఈ సంఘటన జరిగింది. బాధితుడు, రైతు లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి ఆయన గ్రామ శివారులోని తమ పొలంలోని షెడ్డులో గొర్రె పొట్టేళ్లను కట్టేసి ఇంటికి వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున వెళ్లి చూసే సరికి 15 గొర్రె పొట్టేళ్లు చనిపోయి ఉన్నాయి. సంఘటనా స్థలంలో అటవీ జంతువల ఆనవాళ్లు కనిపించాయని తెలిపారు. వాటి విలువ రూ. 1.50 లక్షలు ఉంటుందని తెలిపారు.

ఆవుదూడపై చిరుత దాడి

నారాయణపేట జిల్లా, ధన్వాడ మండలంలోని మందిపల్లి తండాలో ఆవుదూడపై చిరుతపులి దాడి చేసి చంపేసింది. తండాకు చెందిన హనుమంతునాయక్ బుధవారం రాత్రి పాకలో ఎద్దులు, ఆవులతో పాటు, దూడను కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి తర్వాత పాకలో చిరుత పులి ప్రవేశించి ఆవు దూడను చంపేసింది. బుధవారం ఉదయం రైతు వెళ్లి చూసే సరికి దూడ కళేబరం కనిపించింది. తరుచూ ఇలాంటి సంఘటనలు జరుగుతుండటంతో స్థానికులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫారెస్టు అధికారులు స్పందించి చిరుతలను బంధించాలని బాధితులు కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బాలానగర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇటుకల బట్టిలో పనిచేస్తున్న ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండలంలోని నేలబండతండాలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ లెనిన్ తెలిపిన కథనం మేరకు.. ఒడిషా రాష్ట్రం చెర్పాలి ప్రాంతానికి చెందిన త్రినాథ్‌బోయి (55) ఐదు నెలల నుంచి నేలబండతండా సమీపంలో ఇటుకల బట్టీలో పని చేస్తున్నాడు. ఈ నెల 23న అతడు అస్వస్థతకు గురి కావడంతో రాజు అనే వ్యక్తి బాలానగర్ ప్రభుత్వ ఆసుప్రతికి తీసుకెళ్లాడు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. త్రినాథ్ మృతిపై అనుమానాలున్నాయని, విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతీ క్షణం.. భయం.. భయం..

▸▸ సల్కాపురం గుట్టల్లో ఆగని బ్లాస్టింగులు
▸▸ పొలాలకు వెళ్లాలంటే జంకుతున్న రైతులు
▸▸ ఆందోళనలో మూడు గ్రామాల ప్రజలు
▸▸ పట్టించుకోని క్వారీ నిర్వాహకులు
▸▸ అయినా స్పందించని అధికారులు

గట్టు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గుండెలు అదిరి పడేలా పెద్ద శబ్దాలు.. ఎగిరి పడే బండరాళ్లు.. ఎప్పుడేం జరుగుతుందోనన్న భయంతో మూడు గ్రామాల ప్రజలు ప్రతీ క్షణం భయం భయంగా బతుకుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సల్కాపురం గుట్ట వద్ద నున్న 199 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో ఓ కాంట్రాక్టర్ క్వారీ ఏర్పాటు చేశారు. క్వారీ నిర్వాహకులు గుట్టపై యథేచ్ఛగా బ్లాస్టింగులు చేస్తుండటంతో సల్కాపురం, జోగన్‌గట్టు, తారాపురం గ్రామాల ప్రజలు ని త్యం ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ రాయి వచ్చి పడుతుందోనని గుట్ట చుట్టుపక్కల పొలాల్లో పనులు చేసుకొనే రైతులు భయపడుతున్నారు. క్వారీకి సమీపంలో ఏర్పాటు చేసిన క్రషింగ్ మిషన్‌లో బండలను పగులగొట్టి, 10, 20 ఎంఎం కంకరను తయారు చేస్తున్నారు. ప్రతీ రోజు 500 టన్నుల కంకరతో పాటు, డస్టును టిప్పర్లలో భారత్ మాల రహదారి నిర్మాణానికి తరలిస్తున్నారు. ఇలా నిత్యం వందలాది టిప్పర్లు గ్రామాల మీదుగా తిరుగుతుండటంతో పొలాల్లో సాగు చేసిన పంటలపై డస్టు పడి నాశనం అవుతున్నాయి. భారీ వాహనాలు కావడంతో రహదారులు కూడా దెబ్బ తింటున్నాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా, పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంఘటనలు జరిగినప్పుడు బంద్

ఇదే క్వారీలో గత ఏడాది అగస్టు 25న జరిగిన బ్లాస్టింగ్‌తో రాళ్లు ఎగసిపడి మధ్యప్రదేశ్‌కు చెందిన ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ విజయకుమార్‌సింగ్ గోండు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎక్స్‌కవేటర్ ధ్వంసం అయ్యింది. ఈ సంఘటన జరిగిన అనంతరం పేలుళ్లను కొంత కాలం నిలిపేశారు. కొద్ది రోజుల తర్వాత యథావిధిగా మొదలుపెట్టారు. అలాగే గత సంవత్సరం అక్టోబరులో పేలుడు ధాటికి రాళ్లు ఎగిరి పడి సమీపంలోని పత్తి పొలంలో పని చేస్తున్న సల్కాపురం గ్రామానికి చెందిన రైతులు నవీన్, పద్మలకు గాయపడ్డారు. వారిని వెంటనే గద్వాల ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. నవీన్ కడుపులో రాయి కుచ్చుకోవడంతో సర్జరీ చేయాల్సి వచ్చింది. ఇలాంటి సంఘటనలు అనేకం జరుగుతున్నాయని స్థానికులు చెప్తున్నారు.



బ్లాస్టింగ్ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గుట్ట వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు (ఫైల్)

హెచ్చరికలు లేకుండా పేలుళ్లు

గుట్టపై ముందస్తు హెచ్చరికలు లెకుండా బ్లాస్టింగ్‌లు చేస్తుండటం స్థానిక రైతులకు ప్రాణ సంకటంగా మారింది. బ్లాస్టింగ్ చేయాలంటే మైనింగ్, పోలీసు శాఖల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ఎలాంటి అనుమతులూ లేకుండా కంప్రెషర్లతో బండలకు రంధ్రాలు చేసి, బ్లాస్టింగ్ చేస్తున్నారు. పేలుళ్ల శబ్దాలకు చుట్టు పక్కల గ్రామాల్లో ఇళ్లు కంపిస్తున్నాయని గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

అనుమతులపై విచారిస్తాను



సల్కాపురం గట్టు వద్ద, 199 సర్వే నెంబర్‌లోని క్వారీకి అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయంపై విచారిస్తాను. నేను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. గుట్టపై మైనింగ్ విషయం నా దృష్టికి రాలేదు. మైనింగ్ శాఖ అధికారుల ద్వారా పూర్తి సమాచారం తెలుసుకుంటాను.

- సలీమొద్దీన్, తహసీల్దార్, గట్టు

పొలానికి వెళ్లాలంటే భయం

ఎప్పుడు పడితే అప్పుడు బ్లాస్టింగులు చేస్తుండటంతో పొలానికి వెళ్లాలంటే భయం అవుతోంది. గుట్ట చుట్టు పక్కల చాలా మంది రైతులకు పొలాలనున్నాయి. రైతులు సాగు చేసిన పంటలు నిత్యం భారీ వాహనాలు తిరుగుతుండటంతో పాటు, క్రషర్ మిషన్ నుంచి వచ్చే దుమ్ముతో నాశనం అవుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- తిమ్మప్ప, రైతు, సల్కాపురం

అక్రమ క్వారీని మూసేయాలి



ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న క్వారీని తక్షణమే మూసివేయాలి. అక్రమంగా బ్లాస్టింగ్ చేసి కోట్ల రూపాయల విలువైన కంకరను దోచుకుంటున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలి. గత ఏడాది పేలుడు ధాటికి ఓ కార్మికులు మృతి చెందాడు. ఇద్దరు రైతులు తీవ్రంగా గాయపడ్డారు. బోర్లు బావులు పూడుకుపోతున్నాయి. వెంటనే క్వారీని మూసివేయకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతాం.

- వీవీ నరసింహ,
సీఐటీయూ జిల్లా కార్యదర్శి

కేసులు నమోదు చేశాం



గత ఏడాది పేలుడు ధాటికి మధ్యప్రదేశ్‌కు చెందిన కార్మికుడు విజయకుమార్‌సింగ్ గోండు మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన పలువురిపై కేసు నమోదు చేశాం. మరో ఘటనలో గాయపడిన రైతుల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశాం. గుట్టపై జరు గుతున్న బ్లాస్టింగుల గురించి ఇటీవలి కాలంలో ఫిర్యాదులు అందలేదు.

- కేటీ మల్లేశ్, ఎస్ఐ

వక్ఫ్ బిల్లు వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం

▸▸ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల ప్రకటన
▸▸ రేపు మహబూబ్‌నగర్ పట్టణంలో బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జేజేఆర్ రహెమాన్

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ చట్టం, సవరణ బిల్లును వెనక్కి తీసుకునేంత వరకు ఎన్ని సంవత్సరాలైనా సరే ఉద్యమం ఆగదని, మరింత ఉధృతం చేస్తామని వక్తలు స్పష్టం చేశారు. వక్ఫ్ చట్టం సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జేజేఆర్ రహెమాన్, మొహసిన్‌ఖాన్, అన్వర్‌పాషా, తఖీహుస్సేన్, మౌలానా ఇద్రీస్ మాట్లాడారు. అల్లాహ్ పేరిట ముస్లింలకు పూర్వీకులు ఇచ్చిన భూములను లాక్కునే కుట్రలో భాగంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును తెచ్చిందని ఆరోపించారు. అందుకు నిరసనగా ఈ నెల 26న సాయంత్రం 7 గంటలకు మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ముస్లింలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. సభకు ముఖ్య అతిథిలుగా అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు చైర్మన్ మౌలానా ఖాలెద్ సైఫుల్లా, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ హాజరవుతారని తెలిపారు. వక్ఫ్ సంరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా, ముస్లిం సమాజమంతా ఏకతాటిపైకి వచ్చి నిరసన తెలపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అంతకు ముందు మహల్గాం ఉగ్రదాడిలో అమరులైన వారికి సంతాపసూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో ఇక్బాల్, మగ్బుల్, మొహ్రన్‌మోసీన్, రహీం, వహెద్‌తాజ్, సుల్తాన్, అన్వర్, ఇమ్రాన్, హరూన్, మేరాజ్, జావీద్, అజహర్, మహ్మద్‌మక్సూద్, ఖలీం, సమీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

▸▸ త్వరలో గ్రామ, మండల కమిటీలు
▸▸ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు



టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న బక్కని నర్సింహులు

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : టీడీపీకి పూర్వ వైభవం తీసుకొస్తామని, అందుకు త్వరలో గ్రామ, మండల కమిటీలు ఏర్పాటు చేస్తామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. మహబూబ్‌నగ ర్ నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమం గురువారం సాయన్నగౌడ్ స్వగృహంలో నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బక్కని నరసింహులు మాట్లాడుతూ టీడీపీ తెలంగాణ రాష్ట్రంలో 2024-26నకు సంబంధించి 1,78,000 మందిని సభ్యత్వం చేయడం జరిగిందన్నా రు. 19 నియోజకర్గాలు, 17 పార్లమెంట్లలో 578 అడ్‌హక్ కమిటీ సభ్యులు, 17 మంది పార్లమెంటు కన్వీనర్ల కృషి వల్ల సభ్యత్వం పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు శ్రీరాములు, బుచ్చన్న, వెంకటన్న టీడీపీ లో చేరినట్లు తెలిపారు. 17 పార్లమెంటు, 119 నియోజకవర్గాల్లో త్వరలో గ్రామ, మండల, పార్లమెంట్ కమిటీలు మే 15 వరకు పూర్తి చేయాలని తెలిపారు. నియోజకవర్గ నాయకులు కాశీం, సాయన్నగౌడ్, రాములుయాదవ్, శ్రీనివాసులు, మురళి, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, సురేందర్‌గౌడ్, బుచ్చన్న పాల్గొన్నారు.

అలంపూరు ఉప ప్రధాన అర్చకుడిపై వేటు

▸▸ ఆనంద్‌శర్మపై అవినీతి ఆరోపణలు
▸▸ విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు
▸▸ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ



అర్చకుడు ఆనంద్‌శర్మ

అలంపూరు చౌరస్తా, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ క్షేత్రంలోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల ఉప ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మపై వేటు పడింది. ఆయనను విధుల నుంచి తొలగిస్తూ దేవదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అర్చకుడు ఆనంద్‌శర్మపై పలు అవినీతి ఆరోపణలున్నాయి. దీనికి తోడు ఆయన వ్యవహారశైలి కూడా వివాదాస్పదమైంది. గత ఏడాది నవంబరు 23న అలంపూరు ఎమ్మెల్యే విజయుడు దంపతులు కర్నూలు నగరంలోని ఓ థియేటర్‌లో సినిమా చూసేందుకు వెళ్లగా ఆనంద్‌శర్మ అనుమతి లేకుండా మొబైల్ ఫోన్‌లో వారి ఫొటోలు, వీడియోలు తీశాడు. దీంతో ఎమ్మెల్యే అతడి ఫోన్ లాక్కొని అక్కడి టూటౌన్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు 24న ఆనంద్‌శర్మను స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ఎమ్మెల్యే విజయుడు ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కూడా శాసనమండలిలో మాట్లాడుతూ ఆలయాల్లో జరుగుతున్న అవకతవకలపై విచారణ చేపట్టాలని కోరారు. దీంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ మేరకు ఎండోమెంట్ శాఖ జాయింట్ కమిషనర్ శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. అనంతరం ప్రభుత్వ ఆదేశం మేరకు అదే శాఖలోని విజిలెన్స్ కమిషనర్ కృష్ణవేణి విచారణ నిర్వహించారు. మూడు వారాల క్రితం ఆమె అలంపూర్ ఆలయానికి వచ్చి రికార్డులు, రశీదులతో పాటు వివిధ పత్రాలను తనిఖీ చేశారు. ఉద్యోగులు, సిబ్బందితో మాట్లాడి పూర్తి వివరాలను తెలుసుకొని ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దానిని పరిశీలించిన ప్రభుత్వం ఆనంద్‌శర్మను సస్పెండ్ చేస్తూ ఈనెల 23న ఉత్తర్వులు జారీ చేసింది.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

▸▸ దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్



జోగుళాంబ హాల్ట్ వద్ద జరుగుతున్న అమృత్‌భారత్ స్కీం పనులను పరిశీలిస్తున్న దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్, ఇతర రైల్వే అధికారులు

అలంపూరు చౌరస్తా, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని జోగుళాంబ రైల్వేహాల్ట్ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. జోగుళాంబ హాల్ట్ అభివృద్ధి కోసం అమృత్ భారత్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 5 కోట్లతో కొనసాగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట డీఆర్ఎం లోకేశ్ వైష్ణోయ్, పీసీఎంఈ మధుసుదన్‌రావు, కన్‌స్ట్రక్షన్స్ సీఈ సుబ్రహ్మణ్యం ఉన్నారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ అలంపూర్ క్షేత్రానికి వచ్చే భక్తులకు అవసరమైన అన్ని అత్యాధునిక వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఏపీ, తెలంగాణ సరిహద్దులోని పంచలింగాల శివారులో నిర్మాణంలో ఉన్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ఆయన పరిశీలించారు.

జీహెచ్‌ఎంలకు మరోమారు నోటీసులు

▸▸ జిల్లా విద్యాశాఖలో కలకలం
▸▸ 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో కదలిక



మహబూబ్‌నగర్ పట్టణంలోని డీఈవో కార్యాలయం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో 9 మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల(జీహెచ్‌ఎం)కు మరోమారు షోకాజ్ నోటీసులు అందడం జిల్లా విద్యాశాఖలో కలకలం సృష్టించింది. 2023లో జరిగిన గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీల్లో భార్యభర్తలైన టీచర్లు, అధ్యాపకులు, ఇతర శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులున్నారు. భార్యాభర్తలు సమీప ప్రాంతాల్లో, ఉపాధ్యాయులైతే ఒకే పాఠశాలలో పని చేసేందుకు వీలుగా ప్రత్యేకంగా 10 స్పౌజ్ పాయింట్లను అదనంగా ఇచ్చేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. ఇదే అదునుగా కొందరు జీహెచ్‌ఎంలు నిబంధనలకు విరుద్ధంగా స్పౌజ్ పాయింట్లను వినియోగించుకొని, అనుకూలమైన ప్రాంతాల్లో పోస్టింగులు తెచ్చుకున్నారు. దీనిపై నాన్ స్పౌజ్ గజిటెడ్ ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేసినా ఆర్‌జేడీ, విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలను ప్రచురించింది. దీంతో పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర అధికారుల్లో కదలిక వచ్చింది. జీహెచ్‌ఎంల స్పౌజ్ బదిలీ వివరాలను పంపించాలని అప్పటి డీఈవోను ఆదేశించారు. దీంతో ఆర్‌జేడీ విచారణ చేపట్టి, పాఠశాల విద్యాశాఖ అధికారులకు నివేదికను పంపించారు. తప్పిదాలకు పాల్పడిన 11 మంది జీహెచ్‌ఎంలను సస్పెండ్ చేస్తూ గత సంవత్సరం అక్టోబరులో ఉత్తర్వులు జారీ చేశారు. పది రోజుల తర్వాత వారి నుంచి లిఖిత పూర్వక సంజాయిషీ తీసుకున్న ఆర్‌జేడీ, సస్పెన్షన్ ఎత్తివేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. గతంలో కొనసాగిన పాఠశాలల్లోనే విధులు నిర్వర్తించాలని ఆదేశించి పూర్తి స్థాయి విచారణ కొనసాగించారు. స్పౌజ్ పాయింట్లకు సంబంధించి 11 మంది జీహెచ్‌ఎంలు పాఠశాలను సజావుగా ఎంపిక చేసుకున్నారా? వారికి అనుకూలంగా ఎంపిక చేసుకున్నారా? అన్న విషయంపై ఆర్‌జేడీ విజయలక్ష్మి మరోమారు జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి వివరణ తీసుకున్నారు. అనంతరం వారిలో ఇద్దరిని మినహాయించి, తొమ్మిది మందికి మళ్లీ నోటీసులు జారీ చేశారు. మీపై ఎందుకు చర్యలు ఎందుకు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఆర్‌జేడీ కార్యాలయం నుంచి వచ్చిన నోటీసులను ఆ తొమ్మిది మంది జీహెచ్‌ఎంలకు గురువారం పోస్టులో పంపించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. స్పౌజ్ పాయింట్ల వినియోగంలో జరిగిన తప్పిదాలపై 20 నెలలుగా కొనసాగిన విచారణ చివరి దశకు చేరడంపై ఉపాధ్యాయ వర్గాల్లో చర్చలు సాగుతున్నాయి.

ఎస్‌ఏలు, ఎస్‌జీటీలపై చర్యలు ఎందుకు తీసుకోరు?

ఉపాధ్యాయ బదిలీల సందర్భంగా కొందరు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు కూడా తప్పుడు స్పౌజ్ పాయింట్లతో నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను ఎంచుకున్నారు. వారిలో పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకుల భార్యలు, బంధువులు ఉన్నట్లు ఆరోపణలున్నాయి. వారికి ఉన్న పలుకుబడిని ఉపయోగించి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జిల్లా అధికారులు, విద్యాశాఖ అధికారిపై ఒత్తిడి తెచ్చి చర్యలు తీసుకోకుండా అడ్డు పడుతున్నట్లు నాన్‌స్పౌజ్ ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. తప్పుడు సమాచారం ఇచ్చి జిల్లాలోని జడ్చర్ల, బాలనగర్, గండీడ్, దేవరకద్ర, భూత్పూర్, మహబూబ్‌నగర్ మండలాల్లో విధులు నిర్వహిస్తున్న సదరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జడ్చర్ల మండలంలో తప్పుడు సమాచారం ఇచ్చిన నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి దాదాపు పది నెలలు అవుతోంది. అయినా ఇప్పటి వరకు అధికారులకు సమాధానం ఇవ్వలేదని తెలుస్తోంది.

ఆ తొమ్మిది మంది వీరే ..

నోటీసులు అందుకున్న తొమ్మిది జీహెచ్‌ఎంల వివరాలిలా ఉన్నాయి. పి.యుగేందర్ (జడ్చర్ల మండలం, ఆలూరు జడ్‌పీహెచ్‌ఎస్), కే వేంకటేశ్వరమ్మ (మహబూబ్‌నగర్ రూరల్ మండలం, కోడూరు జడ్‌పీహెచ్‌ఎస్), కృష్ణవేణి పవార్ (గండీడు మండలం, కొంరెడ్డిపల్లి జడ్‌పీహెచ్‌ఎస్), పి. కృష్ణయ్య, (మహబూబ్‌నగర్ రూరల్ మండలం, ధర్మాపూర్, జడ్‌పీహెచ్‌ఎస్), ఎం.చంద్రకళ (జడ్చర్ల మండలం, బాదేపల్లి జడ్పీహెచ్‌ఎస్, బాలురు), బి. వెంకటొరెడ్డి (జడ్చర్ల మండలం, పోలేపల్లి, జడ్‌పీహెచ్‌ఎస్), కే నాగేంద్రమ్మ, (దేవరకద్ర జడ్పీహెచ్‌ఎస్, బాలికలు) నాగ్యానాయక్, (నవాబ్‌పేట జడ్పీహెచ్‌ఎస్), ఉషారాణి (భూత్పూర్ మండలం పోతుల మడుగు).

నోటీసులు పంపించాం

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీల్లో తప్పుడు సమాచారం ఇచ్చి పోస్టింగులు పొందిన వారికి రెండవ సారి ఆర్‌జేడీ నుంచి నోటీసులు వచ్చాయి. వాటిని తొమ్మిది మంది జీహెచ్‌ఎంలకు పంపించాం. వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఎస్‌ఏలు, ఎస్‌జీటీల బదిలీల్లోనూ స్పౌజ్ పాయింట్ల తప్పుడు వినియోగానికి సంబంధించిన ఫైల్‌ను పరిశీలిస్తున్నాం. పోస్టులు ఎలా పొందారన్న విషయంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

ప్రవీణ్‌కుమార్, డీఈవో, మహబూబ్‌నగర్

ఇంటర్వ్యూ..

భూసమస్యల పరిష్కారం కోసమే భూ భారతి

- ప్రమీల, తహసీల్దార్, ఉప్పునుంతల



ఉప్పునుంతల ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి పోర్టల్‌ను ప్రభుత్వం తీసుకువచ్చిందని తహసీల్దార్ ప్రమీల గురువారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

భూభారతి పోర్టల్ ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది?

జూన్ 2న భూ భారతి పోర్టల్ అందుబాటులోకి వస్తుంది

సాదాబైనామా కింద రైతులు దరఖాస్తు చేసుకోవచ్చా?

గతంలో సాదాబైనామా కోసం దరఖాస్తు చేసుకున్న వారిని విచారణ చేసి అర్హులైతే రెగ్యులరైజేషన్ చేస్తాం.

ఏఏ నిర్మాణాలకు ఇసుక అనుమతులు ఇస్తున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇసుక అనుమతులు ఇస్తున్నాం.

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబాలకు అండ

కల్వకుర్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ అండగా నిలిచారు. మండల పరిధిలోని గుండూరు గ్రామానికి చెందిన పోతనపల్లి బంగారయ్య, బోడ బీరప్పలు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బాధిత కుటుంబాలకు చేరి రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం నాయకుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో కాటన్‌మిల్ అధ్యక్షుడు ప్రకాశ్‌రావు, రామకృష్ణ, రామచంద్రయ్య, కృష్ణయ్య, నాగేంద్రం, బాలయ్య, నాగయ్య, బీరప్ప, వెంకటయ్య, మల్లేష్, జంగం, బండి లక్ష్మయ్య, రాజు, కృష్ణయ్య, వడ్డె కృష్ణ, భగవంత్, నాగయ్య, డీవై.గౌడ్, తాళ్ల సురేష్ గౌడ్, వెంకటయ పాల్గొన్నారు.

28న భూ భారతిపై అవగాహన

బిజినేపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన భూ భారతి చట్టంపై రైతులకు, అధికారులకు ఈనెల 28న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీరాములు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నాయబ్ తహసీల్దార్ చిక్కుడు రవికుమార్‌తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మీసేవ ఆపరేటర్లు, మహిళా సంఘాల సభ్యులు, రేషన్ డీలర్లు హాజరు కావాలని ఆదేశించారు.

'ఎరువుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి'

తిమ్మాజిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గోదాములు నిల్వ ఉన్న ఎరువుల వివరాలు, అమ్మకాలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ సూచించారు. తిమ్మాజిపేటలోని మణికంఠ ఆగ్రో రైతు సేవ కేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఎరువుల గోదాము రికార్డులను ఈపాస్ మిషన్ పరిశీలించి యజమానికి పలు సూచనలు, సలహాలు చేశారు. నిషేధిత మందులు అమ్మితే చర్యలు తప్పవన్నారు.

అన్నదానం మహా పుణ్యకార్యం

- ఆర్టీసీ డిపో మేనేజర్ ఏ యాదయ్య

కందనూలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : అన్ని దానాలకెల్లా అన్నదానం మహాపుణ్య కార్యమని ఆర్టీసీ డిపో మేనేజర్ ఏ.యాదయ్య అన్నారు. గురువారం భగవాన్ శ్రీసత్యసాయి బాబా 14వ ఆరాధన మహోత్సవం సందర్భంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్‌లో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు గ్యారేజ్ ఇన్‌చార్జి భాస్కర్, ట్రాఫిక్ ఇన్‌చార్జి జేఆర్.రెడ్డి, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ హాకీం విశ్వప్రసాద్, ట్రస్టు కన్వీనర్ ఎలిమేశ్వరయ్య, భాస్కర్, మన్యపురెడ్డి, సుప్రజ, భాస్కర్, మహిళా భక్తులు పాల్గొన్నారు.

దళారులకు విక్రయించొద్దు

చారకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దని సింగిల్‌విండో చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయశాఖ అధికారి తనూజరాజ్‌తో కలిసి సింగిల్‌విండో చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరక్టర్ కొండల్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మహేందర్, సింగిల్ విండో సీఈవో వెంకటయ్య, ఏఈవో అనూష, సిబ్బంది భీమయ్యగౌడ్ పాల్గొన్నారు.

విద్యా వలంటీర్లకు సన్మానం

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : 2025-26విద్యా సంవత్సరానికి గాను మండల పరిధిలోని మరికల్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల పిలుపు మేరకు ఇద్దరు మహిళా విద్యా వలంటీర్లు స్వచ్ఛందంగా విధులు నిర్వహించారు. కొల్లె నాగలక్ష్మి, సాబేరాబేగం పాఠశాలలో వలంటీర్లుగా పని చేశారు. గురువారం పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి వారిద్దరినీ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం

- అదనపు కలెక్టర్ అమరేందర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అమరేందర్

చారకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం-2025 ద్వారా భూ సంబంధ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసీల్దార్ అద్దంకి సునీత అధ్యక్షతన భూ భారతి 2025 చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు అదనపు కలెక్టర్ అమరేందర్, కల్వకుర్తి ఆర్డీవో శ్రీను ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతుల దీర్ఘకాల సమస్యలు తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని అన్నారు. గత ధరణి పోర్టల్ ద్వారా అధికారులకు అధికారం లేకుండా ఉండేదని అన్నారు. నూతన భూ భారతి చట్టంలో రైతులకు అనేక సౌకర్యాలు కల్పించిందని పేర్కొన్నారు. అన్నారు. భూ భారతి అవగాహన సదస్సుకు వచ్చిన వారికి మండల వైద్యాధికారి డాక్టర్ మంజుభార్గవి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

రైతులకు రక్షణ కవచం

భూ భారతి చట్టం చట్టం రైతుల భూములకు రక్షణ కవచంలా పని చేస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గురువారం నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో వీడియో కాల్‌లో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పేరుకపోయిన భూ సమస్యలకు భూ భారతి ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు నమూన నిర్మాణ భవనాన్ని ఆర్డీవో శ్రీను, తహసీల్దార్ సునీత, నాయకులతో కలిసి అదనపు కలెక్టర్ అమరేందర్ పరిశీలించారు. పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, మండల వ్యవసాయశాఖ అధికారి తనూజరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాలరాం గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ విద్యాధరిరెడ్డి, ఎంపీవో వెంకటేష్, సింగిల్‌విండో డైరెక్టర్ కొండలయ్యగౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మహేందర్, జైపాల్, వివిధ శాఖల అధికారులు, రైతులు, ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి

కల్వకుర్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రైతు బాగుంటేనే దేశం బాగుంటుందనే సంకల్పంతో రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా కొనుగోళ్లు జరగాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల, పంజుగుల, ముకురాల గ్రామాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యేప్రారంభించారు. ముకురాల గ్రామంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర రూ.2320తో పాటు సన్నరకానికి మరో రూ.500బోనస్ పొందాలని కోరారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సైతం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పొద్దుతిరుగుడు గింజల కొనుగోలు కేంద్రాలు రాష్ట్రంలోనే మూడు ఉన్నాయని, అందులో తలకొండపల్లి పడకల్ గ్రామంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మాజీ జడ్పీటీసీ అశోక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలాసంజుకుమార్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జిల్లెల రాములు, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, మల్లెపల్లి జగన్, శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటేశ్, సురేష్ రైతులు, నాయకులు ఉన్నారు.

కశ్మీర్ మృతవీరులకు హిందూ ఐక్యవేదిక నివాళి

- కొల్లాపూర్‌లో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ



కొల్లాపూర్‌లో నివాళి అర్పిస్తున్న హిందూ ఐక్యవేదిక నాయకులు

కొల్లాపూర్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : జమ్మూకశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా గురువారం రాత్రి కొల్లాపూర్ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉగ్రవాదం నశించాలని కొవ్వొత్తులతో పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఉగ్రవాదుల చేతుల్లో అమరులైన మృతవీరులకు వారు నివాళ్లర్పించారు. జాతీయ జెండాలు పట్టుకొని, కొవ్వొ త్తులతో ఉగ్రవాదం నశించాలని నినాదాలు చేస్తూ కొల్లాపూర్‌లో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కొల్లాపూర్ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణ ప్రజలు ఉద్యోగులు , యువకులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఉగ్రవాదులు మతం పేరు తెలుసుకుని కాల్చడం దిక్కుమాలిన చర్య అని అన్నారు. అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదుల చర్యను కేంద్రం తిప్పి కొడుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు.

కేజీబీవీ ఇంటర్ విద్యార్థులను అభినందించిన డీఈవో



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో రమేష్‌కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన జిల్లాలోని పలు కేజీబీవీ విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ అభినందించారు. గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో 6 కేజీబీవీ జూనియర్ కళాశాలల విద్యార్థినులు వారి ప్రత్యేక అధికారులతో కలిసి డీఈవోను మర్యాదపూర్వకంగా కలిశారు. చారకొండ కేజీబీవీ విద్యార్థిని శ్రావణి ద్వితీయ సంవత్సరం బైపీసీలో 975 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 16వ స్థానంలో నిలిచింది. తెల్కపల్లి కేజీబీవీ సీఈసీ విద్యార్థిని బి.దివ్య 941, కల్వకుర్తి విద్యార్థిని హేమలత ఎంపీహెచ్‌డబ్ల్యూలో 966 మార్కులు సాధించారు. అదేవిధంగా మొదటి సంవత్సరంలో కొల్లాపూర్ విద్యార్థిని బి.అనూష 462, నాగర్‌కర్నూల్ విద్యార్థిని జి.విజయ బైపీసీలో 440, బిజినేపల్లి విద్యార్థిని ఆర్.పుష్ప సీఈసీలో 467 మార్కులు సాధించారు. వీరందరిని డీఈవో రమేష్‌కుమార్ శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలో కేజీబీవీల్లోని విద్యార్థులు ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మొత్తం 527 మందికి గాను 441 మంది పాసవగా, మొదటి సంవత్సరంలో మొత్తం 556 మందిలో 409 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలికా విద్యాధికారి శోభారాణి, ఎస్ఎస్ఏ పర్యవేక్షకులు సుజాత, తిరుపతమ్మ, కేజీబీవీ ప్రత్యేక అధికారులు మంజుల, రమాదేవి, సుమిత్ర, హసీనా, నారా యణమ్మ పాల్గొన్నారు.

బడిబాట పాట సీడీ ఆవిష్కరణ

నాగర్‌కర్నూల్ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే బడిబాట కార్యక్రమం పాటల సీడీని డీఈవో రమేష్‌కుమార్ ఆవిష్కరించారు. గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రముఖ గాయని, ఉపాధ్యాయురాలు పద్మాలయ, ఇద్రిస్, సీతారం డీఈవోను మర్యాదపూర్వకంగా కలిసి 'రండి రండి రండి' బడిబాట పాటను ఆవిష్కరింపజేశారు.

1 నుంచి అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ పరీక్షలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్యలక్ష్మి

కందనూలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మే 1 నుంచి అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ పరీక్ష కార్యక్రమం ప్రారంభించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ పరీక్షలపై వైద్యాధికారులకు, పర్యవేక్షణ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులైన రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్లు, పక్షవాతం, కిడ్నీ వైఫల్యం తదితర వ్యాధుల వలన ప్రజల్లో 65శాతం మరణాలు, అస్వస్థ కలుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటదాస్, డాక్టర్ భీమానాయక్, డాక్టర్ తారాసింగ్, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కృష్ణమోహన్, రవికుమార్, డీపీవో రేణయ్య, విజయ్‌కుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కొండనాగుల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

బల్మూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొండనాగుల గ్రామంలో ఉన్నత పాఠశాల 2004-05 సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు గురువారం సమావేశమయ్యారు. నాటి ఉపాధ్యాయులతో కలిసి పరిచయ కార్యక్రమాలు ప్రస్తుతం చేస్తున్న పనులను విద్యార్థులు ఒకరినొకరు పంచుకున్నారు. నాటి ఉపాధ్యాయులు విద్యార్థుల ఎదుగుదలను విని సంతోషపడ్డారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సాగిపోయే జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయని, వాటిని దాటుకుం టూ నేటి సమాజానికనుగుణంగా బతకడం నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విష్ణుమూర్తితో పాటు నేటి ఉపాధ్యాయులు, పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల భూములకు రక్షణ కవచంలా భూ భారతి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



వీడియో కాల్ ద్వారా మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : రైతుల భూములకు రక్షణ కవచంలా భూ భారతి ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి అధికారులకు వీడియోకాల్ ద్వారా అవగాహన కల్పించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన తెలంగాణ భూభారతి చట్టం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. గతంలో ఉన్న ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, మేధావులు, రైతుసంఘాలు, అందరితో చర్చించి గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. భూభారతిపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

కొండారెడ్డిపల్లిలో కొనసాగుతున్న కంటి వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని సందర్శించిన కేవీఎస్‌రెడ్డి

వంగూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరం 6వ రోజు విజయవంతంగా కొనసాగుతోంది. గ్రామస్థులతో పాటు సమీప గ్రామాల ప్రజలు కంటి వైద్య సేవలు పొందుతున్నారు. గురు వారం రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, ఈఎన్‌సీ గణపతిరెడ్డి శిబిరాన్ని సందర్శించారు. కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని వారు అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థలు, మానవతావాదులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ వేమారెడ్డి, ఎనుముల రాజశేఖర్ రెడ్డి, జంగయ్యయాదవ్, బాబూయాదవ్, రాము, వంశీ, వెంకటయ్య పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

చారకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నూకలచింతవాడికతండాకు చెందిన తుర్కలపల్లి మాజీ సర్పంచ్ గణ్యానాయక్ (70) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. పలువురు నాయకులు, గ్రామస్థులు గణ్యానాయక్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సర్పంచిగా ఉన్న సమయంలో గ్రామానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : ఎంపీడీవో

ఊర్కొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో కృష్ణయ్య అన్నారు. గురువారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి దివస్ పురస్కరించుకొని మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఇప్పపహాడ్‌లో గ్రామ సభ నిర్వహించారు. పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఎంపీవో లక్ష్మణ్‌నా యక్, ఏపీవో నరసింహ, పంచాయతీ కార్యదర్శి పద్మ తదితరులు ఉన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు - ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



జటప్రోలులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి జూపల్లి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల

పెంట్లవెల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల ఆశయ సాధనకు కృషి చేద్దామని పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. గన్నీ బ్యాగుల సైజు తక్కువగా ఉండడంతో ధాన్యం నింపేందుకు ఇబ్బందిగా ఉందని రైతులు చెప్పడంతో కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం నిర్వహించిన జై బాపూ, జైభీం, జై సంవిధాన్ ర్యాలీలో పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గుమ్మడి వెన్నెలతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గాంధీ, అంబేడ్కర్ ఆశయాలు పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. జటప్రోలులో రూ.150 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి వారం రోజుల్లో భూమిపూజ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోవిందుగౌడ్, రామన్‌గౌడ్, భీంరెడ్డి, నాగిరెడ్డి, నల్లపోతుల గోపాల్, ఆకునమోని రాముయాదవ్, కృష్ణప్రసాద్, కోట్ల సురేందర్, గురక అంజనేయులు, బాలరాజు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయం అందిస్తాం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నసీం సుల్తానా - సబ్ జైలు పరిశీలన



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నసీం సుల్తానా

కందనూలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నసీం సుల్తానా సబ్ జైలును గురువారం పరిశీలించారు. జైల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, తినే ఆహార పదార్థాలు, వంట గదిని, వాష్‌రూమ్‌ను పరిశీలించారు. ఆమె ఖైదీలతో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిని కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా న్యాయ సహాయం కావలిస్తే తమ సంస్థ తరఫున ఉచితంగా న్యాయ సహాయమందించి అడ్వకేట్‌ను నియమిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్ ఆర్య డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్, పవన్, శేషు, సాయి, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్ నాగరాజు పాల్గొన్నారు.

తూడుకుర్తిలో కొనుగోలు కేంద్రం ప్రారంభం



తూడుకుర్తిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

కందనూలు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రా మాల్లోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సకాలంలో వరిని కొంటున్నామని తెలిపారు. సన్నరకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500బోనస్ ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు. అదేవిధంగా బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడి గాయత్రి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తెలకపల్లి మండలం పెద్దపల్లి గ్రామస్థుడు జగదీశ్వర్ రెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు.

● తెలకపల్లి : మండలంలోని చిన్నముద్దనూర్ గ్రామంలోని పీఏసీఎస్ గోదాము ఆవరణలో గురువారం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సూపరింటెండెంట్ మధురావు, మానిటరింగ్ ఆఫీసర్ గణేష్, ఉపాధ్యక్షుడు యాదయ్య, కార్యవర్గ సభ్యులు రాజమహేందర్‌రెడ్డి, ఉషన్న, లింగస్వామి, నరేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగయ్య, డైరెక్టర్లు తిరుపతయ్య, రాజేందర్‌రెడ్డి, ఏడీఏ, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఏవో, సీఈవో ధర్మవీర్ పాల్గొన్నారు.

మహనీయుల జాతరను జయప్రదం చేయాలి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రామచందర్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బహుజన మహనీయులు బాబాసాహెబ్ అంబేడ్కర్, మాన్యవర్ కాన్షీరాం జయంతుల సందర్భంగా ఈ నెల 26న జిల్లా కేంద్రంలోని జడ్పీ మైదానంలో నిర్వహించనున్న జాతరను జయప్రదం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రామచందర్, నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొత్తపల్లి కుమార్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలో బీఎస్పీ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. రాంచందర్ మాట్లాడుతూ శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి నిర్వహించనున్న మహనీయుల జాతరకు ముఖ్య అతిథులుగా బీఎస్పీ జాతీయ కోఆర్డినేటర్ రాంజీగౌతమ్‌తో పాటు రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ హాజరవుతారని పేర్కొన్నారు. జాతరకు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మేధావులు, యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించడంతో పాటు దాడిలో చనిపోయిన కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ఈసీ సభ్యుడు పృథ్వీరాజ్, జిల్లా నాయకులు కళ్యాణ్, బొల్లి కురుమయ్య, నాగేష్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

అచ్చంపేట రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27వ తేదీన జరగబోయే రజతోత్సవ సభ వారోత్సవాలకు అచ్చంపేట నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేయాలని మా జీ జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు కోరారు. అచ్చంపేట మండలంలోని ఐనోల్, చేదురుబావి తండా, దుబ్బతండా, సింగారం, పెద్దతండా, కొర్రతండా వంటి గ్రామాల్లో బహిరంగ సభకు మద్దతుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ నెల 27న గ్రామాల్లో బయల్దే ముందు పార్టీ జెండాను ఆవిష్కరించాలనిసూచించారు.

సభను విజయవంతం చేయాలి

వంగూరు : వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు గణేష్‌రావు కోరారు.

ఉగ్రవాదుల దాడులపై న్యాయవాదుల నిరసన

కల్వకుర్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ కల్వకుర్తిలో న్యాయవాదులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కల్వకుర్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ముందు న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. టెర్రరిస్టుల ఉగ్ర చర్యలకు ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది బృంగి అమరేందర్ ఖండించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు మద్దతుగా నిలవాలని వారు కోరారు. నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు వెంకట్‌గౌడ్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్, వెంకటరమణ, గగన్, రాంగోపాల్, ఎముక జంగయ్య, నాగరాజు, శివకుమార్, శ్రీకాంత్, మల్లేష్, నరేష్, శ్రీను, మల్లేష్, శివ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలి

- జిల్లా పంచాయతీ అధికారి రామ్మోహన్‌రావు



కోడుపర్తిలో గాంధీజీ విగ్రహానికి పూల మాల వేస్తున్న అధికారులు, గ్రామ నాయకులు

తిమ్మాజిపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి రామ్మోహన్‌రావు అన్నారు. పంచాయతీ దినోత్సవం సందర్భంగా గురువారం తిమ్మాజిపేట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గాంధీజీ విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించి స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం అమల్లోకి వచ్చిన దినమని వారు గుర్తు చేశారు. అనంతరం ప్రత్యేక గ్రామసభను నిర్వహించి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రతీ ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. సకాలంలో ఇంటి పనులు చెల్లించాలని, ఇంటి నిర్మాణాల కోసం అనుమతులు పొందాలని ప్రజలను కోరారు. అనంతరం కొడుపర్తి గ్రామంలో నిర్వహించిన పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, తాడూరు ఎంపీడీవో బ్రహ్మాచారి, ఎంపీవో రాములునాయక్, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌రావు, ఎస్‌బీఎం కో ఆర్డినేటర్ ఉషన్న, అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.